ఐఫోన్ అమ్ముతానంటూ బురిడీ ..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6: ఓఎల్ఎక్స్‌లో ఐ ఫోన్ అమ్ముతామంటూ వ్యక్తిని బురిడీ కొట్టించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.2లో నివాసం ఉంటున్న వ్యాపారి శంకర్ అగర్వాల్ ఇటీవల ఐఫోన్ కొనేందుకు ఓఎల్ఎక్స్‌లో సెర్చ్ చేస్తుండగా కిరణ్ అనే వ్యక్తి తనవద్ద ఐ ఫోన్ 16 ప్రో మాక్స్ ఉందని చెప్పాడు. దాన్ని అర్జెంట్‌గా అమ్మాల్సిన అవసరం ఉందని నమ్మించాడు. తన సోదరుడు వచ్చి ఫోన్ చూపిస్తాడని, చూసిన తర్వాత డబ్బులు ఇవ్వాలని చెప్పాడు. దీంతో బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని జింఖానా క్లబ్ వద్దకు వచ్చిన శంకర అగర్వాల్‌ను ఓ యువకుడు కలిశాడు. తన అన్న ఐఫోన్ పంపించాడని చూపించాడు. ఫోన్ నచ్చడంతో రూ.75వేలు అతడు సూచించిన నంబర్‌కు పంపించాడు. ఫోన్‌లో తన సోదరుడితో కన్ఫర్మ్ చేసుకుంటానంటూ మాటల్లో పెట్టిన గుర్తుతెలియని వ్యక్తి అక్కడినుంచి ఉడాయించాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన శంకర అగర్వాల్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్
(లోకల్ ఆఫీస్/బ్రాంచ్): యాక్సిస్ బ్యాంక్, # 5-2-183/184, మోది స్క్వేర్, 3వ అంతస్తు, ఆర్.పి. రోడ్, సికింద్రాబాద్-500003

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాఫ్లెక్స్, NPC-1, TTC ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సన్ రోడ్, ఎయిరోలి, నవీ ముంబాయి-400708. నమోదిత కార్యాలయం: "త్రిసూల్", 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్ ఎదురుగా, ఎల్లిస్ బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006

స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన లోన్ నం. PCR000808723023లో 1. శ్రీ అడ్డ కరుణాకర్ రెడ్డి (దరఖాస్తుదారు) మరియు 2. శ్రీమతి అడ్డ ఉషా నుండి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉన్న బకాయి భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలతో 10.10.2023 నాటికి బకాయిలు రూ. 1,05,83,581.97 (ఒక కోటి ఐదు లక్షల ఎనభై మూడు వేల ఐదు వందల ఎనభై ఒక్క రూపాయల తొంబై ఏడు పైసలు మాత్రమే)ను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/చార్జ్ చేసిన, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించబడిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "ఏదీ ఉంటే అది" మరియు "అక్కడ ఏమున్నదో అది" ప్రాతిపదికపై 14-03-2025న విక్రయించబడుతుందని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలంగా తెలియజేయడమైనది. అవసరమైన వివరాల కొరకు జతచేసిన వేలం షెడ్యూల్‌ను చూడగలరు:

తెలిసిన తాకట్టు రుణభారాలు (ఏవైనా వుంటే)	లేవు
రిజర్వు ధర (రూ.లో)	రూ. 1,59,04,800/- (ఒక కోటి యాభై తొమ్మిది లక్షల నాలుగు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే)
బయానా (రూ.లో)	రూ. 15,90,480/- (పదిహేను లక్షల తొంబై వేల నాలుగు వందల ఎనభై రూపాయలు మాత్రమే) యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ పేరున తెలంగాణ వద్ద చెల్లించబడేలా DD/PO ద్వారా. యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ పేరున సికింద్రాబాద్ వద్ద చెల్లించబడేలా DD/PO ద్వారా.
బిడ్ పెంపుదల మొత్తం	రూ. 20,000/- (ఇరవై వేల రూపాయలు మాత్రమే)
బయానాతో బిడ్లు/టెండరు దాఖలుకు ఆఖరి తేది, సమయం మరియు ప్రదేశం	శ్రీ కోట రాజ్ కుమార్ గారికి అడ్రస్ చేసి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్ - RAC, # 5-2-183/184, 3వ అంతస్తు, మోది స్క్వేర్, రాణిగంజ్, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-500003 వద్ద 13.03.2025న మ. 3.00 గం.వరకు.
బహిరంగ ఇ-వేలం తేది, సమయం మరియు ప్రదేశం	వెబ్ పోర్టల్ https://www.bankeauctions.com వద్ద ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో 14.03.2025న ఉ. 11.00 గం. నుండి మ. 12.00 గం. మధ్య. ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ మొ.వి కలిగిన ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు పైన తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్‌లో లభిస్తాయి.

షెడ్యూల్-ఆస్తి వివరణ:

SRO, బోయిన్‌పల్లి, సేల్ డీడ్ డాక్యుమెంటు నం.282/2004 ప్రకారం శ్రీ అడ్డ కరుణాకర్ రెడ్డి పేరున ఉన్న ఆస్తి యొక్క సరిహద్దు తనఖా. ఎస్ఆర్ఓ బోయిన్‌పల్లి సమక్షంలో డాక్యుమెంట్ నెం.282/2004 కలిగిన సేల్ డీడ్ ప్రకారం, శ్రీ అడ్డ కరుణాకర్ రెడ్డి తండ్రి అడ్డ జయరాం రెడ్డి పేరున కలిగి ఉండి, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ జిల్లా, సికింద్రాబాద్, తిరుమలగిరి గ్రామం వద్ద గల, రవి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ లేఅవుట్‌లో 234 చ.గజాలలో 117 చ.గజాలు లేదా 97.81 చ.మీటర్లు విస్తీర్ణం, సర్వే నెం.28/2లో ప్లాట్ నెం.13 (SCB.No. 5-08-010)పై ఇల్లు దక్షిణ భాగం యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.13, దక్షిణం: రోడ్, తూర్పు: ప్లాట్ నెం.13/ఎ, పశ్చిమం: 30'వెడల్పు రోడ్. పై సదరు ఇల్లు ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, పైప్ ఫిట్టింగ్స్ మరియు వాటర్ కనెక్షన్స్ మొ. వాటితో అన్ని యాక్సరసరీస్, విండోస్, డోర్స్, సూపర్‌స్ట్రక్చర్స్ కలిగి ఉన్నది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా https://www.axisbank.com/auction-retail మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s. C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.comలో ఏర్పాటు చేసిన లింక్‌ను చూడండి.

వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s. C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించబడును. ఏదేని ఇతర సహాయం కొరకు కాగోరు బిడ్డర్లు శ్రీ ఫాతిమా షేక్ (9381793217) & శ్రీ రాజ్‌కుమార్ (మొబైల్ నం.7396604144), బ్యాంక్ అధీకృత అధికారిని కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం. నుండి సా. 4.00 గం.వరకు. సంప్రదించవచ్చును.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) క్రింద రుణగ్రహీతలకు 30 రోజుల నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.

తేది: 06-02-2025,
ప్రదేశం: సికింద్రాబాద్

సం/- అధీకృత అధికారి,
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

కాన్పూర్ కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల దందా

నగరంలో విక్రయం.. ఇద్దరు అరెస్ట్

సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న దక్షిణ,తూర్పు మండలం అదనపు డీసీపీ స్వామి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 6 : ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్ కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల దందా కొనసాగుతోంది. తెలంగాణలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లను తయారు చేసి నగరంలో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా నకిలీ సర్టిఫికెట్లను విక్రయిస్తున్న ముఠాలోని ఇద్దరు సభ్యులను డబీర్‌పురా పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 91 నకిలీ సర్టిఫికెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణ, తూర్పు మండలం అదనపు డీసీపీ స్వామి, మలక్‌పేట్ ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ నాను నాయక్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాం సైదాబాబుతో కలిసి వివరాలను వెల్లడించారు. పాతబస్తీలో ఎలాంటి విద్యార్హతలు లేకుండా విదేశాలకు వెళ్లే వారికి నకిలీ సర్టిఫికెట్లను అమ్ముతున్నట్లు డబీర్‌పురా పోలీసులకు సమాచారం అందింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. గురువారం చంచల్‌గూడ న్యూరోడ్‌లో వెళ్తున్న ఇద్దరిని డబీర్‌పురా, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించ గా నకిలీ సర్టిఫికెట్ల గుట్టు రట్టు అయ్యింది. ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్ కేంద్రంగా సంజయ్ శర్మ అనే వ్యక్తి తెలంగాణలోని వివిధ విద్యాసంస్థలకు చెంది న నకిలీ సర్టిఫికెట్లను తయారు చేసి సరఫరా చేస్తున్నాడు. శాలిబండకు చెందిన అబ్దుల్ కదీర్ అలియాస్ కదీర్(47), డబీర్ పురా ఫర్హత్‌నగర్‌కు చెందిన మహ్మద్ షకీల్(37)లు నగరంలో అవసరం ఉన్నవారికి నకిలీ సర్టిఫికెట్లను విక్రయిస్తున్నారు. వారి నుంచి మొత్తం 91 నకిలీ సర్టిఫికెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నా రు. వీటిలో కాకతీయ, నాగార్జున, ఉస్మానియా యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్లు ఉన్నాయి.

నకిలీ మెయిల్ ఐడీతో షేర్లు బదిలీ

ఇద్దరు నిందితుల అరెస్ట్

నిందితులు లక్ష్మీ దీపక్, శ్రవణ్ కుమార్

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): నకిలీ మెయిల్ ఐడీ సృష్టించి ఓ మహిళ షేర్లను బదిలీ చేసుకుని, ఖాతాను దుర్వినియోగం చేసిన ఇద్దరు కేటుగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ తండ్రి మరణించడంతో ఆయన డీమ్యాట్ ఖాతాలోని షేర్లు క్లెయిమ్ కాలేదు. దీంతో వాటిని తిరిగి పొందేందుకు సహాయం చేస్తానని వారసిగూడకు చెందిన లక్ష్మీదీపక్ ఆమెను నమ్మించాడు. 2014లో ఆమెతో ఆదిత్యా బిర్లా మనీ లిమిటెడ్‌లో డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతా తెరిపించాడు. ఈ క్రమంలో ఆమె ఫోన్ ద్వారా నకిలీ ఈ-మెయిల్ సృష్టించాడు. ఆ నకిలీ మెయిల్ ద్వారా ఆమె ఖాతా నుంచి షేర్లను బదిలీ చేసుకున్నాడు. మోసపోయానని తెలుసుకున్న మహిళ 2018లో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులకు ఆ నకిలీ ఈ-మెయిల్ తార్నాకకు చెందిన రాగు శ్రవణ్‌కుమార్ పేరిట ఉన్నట్లు గుర్తించారు. లక్ష్మీ దీపక్, శ్రవణ్‌లు కలిసి బాధితురాలి నుంచి షేర్లు, నగదు కొట్టేయడానికి ప్లాన్ చేసినట్లు నిర్ధారించారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి ఏడో అడిషినల్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా.. ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ గంగాధర్, సైబర్ క్రైమ్ ఏసీపీ ఆర్‌జీ శివ మారుతీ, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు శ్రీశైలం, నర్సింగ్ రావు, రాజగోపాల్, మహ్మద్ మహబూబ్ అలీఖాన్‌ను డీసీపీ అభినందించారు.

ట్యాంకర్ ఢీకొని ఒకరు మృతి

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 6 : వాటర్ ట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలకు గురయ్యారు. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా, కొవ్వూరు మండలం, చెన్నూరుకు చెందిన పెనుకొండ గోపాలకృష్ణ (33) బతుకు దెరువు నిమిత్తం నగరానికి ఐదేళ్ల క్రితం వలసవచ్చాడు. గౌలిదొడ్డి కేశవ్‌నగర్‌లో నివసిస్తూ కూలిపని చేసుకొని జీవిస్తున్నాడు. కాగా.. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు పని నిమిత్తం స్నేహితుడు శ్రీకాంత్(30)తో కలిసి బుధవారం సాయంత్రం కూకట్‌పల్లి కోర్టుకు వెళ్లి తిరిగివస్తున్నాడు. మార్గ మధ్యలో వీరి ద్విచక్రవాహనాన్ని మసీదుబండా ప్రాంతంలో వేగంగా దూసుకువచ్చిన వాటర్ ట్యాంకర్(టీఎస్07యూ6710) ఢీకొట్టింది. దీంతో గోపాలకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలతో శ్రీకాంత్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రికవరీ మొబైల్‌లను మీడియా సమావేశంలో చూపిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

1,016 మొబైల్ ఫోన్లు రికవరీ

ఫోన్లు పోతే సీఈఐఆర్ వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 6 : ప్రజలు విలువైన వస్తువులు తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. ప్రజలు పోగొట్టుకున్న రూ.3కోట్ల విలువచేసే 1016 మొబైల్ ఫోన్లను రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు స్వాధీనం చేసుకుని.. బాధితులకు అందజేశారు. గురువారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. విలువైన వస్తువులను దొంగలించినప్పుడు సీఈఐఆర్ వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎల్‌బీ నగర్, మల్కాజిగిరి, బోనగిరి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోయిన మొత్తం 1016 మొబైల్ ఫోన్లను రికవరీ చేయగా.. వీటి విలువ సుమారు రూ.3 కోట్ల వరకు ఉంటుందని చెప్పారు. ప్రజలు ఎవరూ పాత మొబైల్ ఫోన్లను కొనరాదని సీపీ విజ్ఞప్తి చేశారు. మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని, నేరస్తులు మొబైల్ ఫోన్లను దొంగిలించి దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. రికవరీ అయిన ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు మాట్లాడుతూ.. పోయిన ఫోన్లు తిరిగి రావేమో అని ఎంతో బాధ అనుభవించామని, తిరిగి మాకు ఫోన్లు దొరికినందుకు రాచకొండ కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఫోన్లను రికవరీ చేయడంలో కృషిచేసిన క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, ఏసీపీ కరుణాసాగర్, సీసీఎస్ స్పెషల్ టీం, ఐటీ సెల్ అధికారులను సీపీ అభినందించారు.

ప్రియురాలిపై దాడిచేసిన జిమ్ ట్రైనర్ అరెస్ట్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6: తనను ప్రేమిస్తూ.. వేరే యువతితో తిరుగుతున్నావంటూ నిలదీసిన ప్రియురాలిపై దాడి చేసిన జిమ్ ట్రైనర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీ, విశాఖపట్నం జిల్లాకు చెందిన కుమరళ్ల ప్రసాద్ (27) జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని వెంకటగిరిలో నివాసం ఉంటున్నాడు. హైలమ్ కాలనీలోని ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌కు మూడేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న యువతి(24)తో ప్రేమాయణం ఉంది. ఇటీవల తరచూ మద్యం సేవించడంతోపాటు వేరే యువతితో పరిచయం పెంచుకున్న ప్రసాద్.. ప్రియురాలిని వేధిస్తున్నాడు. వేరే యువతితో తిరుగుతున్న విషయం గురించి మాట్లాడేందుకు రెండ్రోజుల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నం.10(సి)లోని పబ్ సమీపంలోకి వచ్చిన యువతితో మాటామాటా పెరగడంతో ప్రసాద్ ఆమెపై దాడి చేశాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు ప్రసాద్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మస్తాన్‌సాయి, శేఖర్‌బాషాలపై మరో కేసు

మణికొండ, ఫిబ్రవరి 3 : డ్రగ్స్ మాఫియా, అశ్లీల వీడియోలతో సంచలనం సృష్టిస్తున్న మస్తాన్ సాయి కేసులో మరో బాధితురాలు గురువారం నార్సింగి పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే...మస్తాన్‌సాయి, శేఖర్‌బాషాలు కలిసి తన ఫోన్‌కాల్స్‌ను రికార్డ్ చేసి పలు యూట్యూబ్ చానళ్లలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ సృష్టి వర్మ అనే యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో వారిద్దరు.. పలువురు అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేశారంటూ బాధితురాలు ఆరోపించింది. ఈ మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రిజం పబ్ కేసు.. పోలీసుల అదుపులో మరొకరు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 6 : గచ్చిబౌలి ప్రిజం పబ్ కాల్పుల కేసులో మోస్ట్‌వాంటెడ్ బత్తుల ప్రభాకర్ స్నేహితుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రంజిత్‌ను గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాల్పులు జరిపిన రోజు ప్రిజం పబ్ వద్ద బత్తుల ప్రభాకర్‌ను కారులో దింపిన వ్యక్తి రంజిత్‌గా తేలడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. 2023 నుంచి ప్రభాకర్‌తో రంజిత్ సన్నిహితంగా ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. రంజిత్ అద్దెకు తీసుకున్న ఇంట్లోనే ప్రభాకర్ ఉంటున్నట్లు విచారణలో వెల్లడైంది. రంజిత్ బ్యాంకు ఖాతాలను ప్రభాకర్ ఉపమోగించినట్లు, చోరీలకు పాల్పడిన డబ్బును రంజిత్ ఖాతాల్లోనే రెండేళ్లుగా చేస్తున్నట్లు పోలీసులు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తుంది. ప్రభాకర్‌తో కలిసి ఉంటున్న రంజిత్‌కు అతడు చేసే చోరీలతో ఎంతమేరకు సంబంధం ఉంది, బిహార్‌లో ఆయుధాలు కొనుగోలు చేసినప్పుడు ప్రభాకర్‌తో వెళ్లింది ఎవరనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

ఇరువురి అవయవదానం..

మణికొండ యాదయ్య (ఫైల్)

రొయ్యపల్లి శ్రీనివాస్ (ఫైల్)

ఖైరతాబాద్, ఫిబ్రవరి 6 : తాము మరణించినా పలువురికి అవయవ దానం చేశారు గచ్చిబౌలికి చెందిన మణికొండ యాదయ్య(58), రంగారెడ్డి జిల్లా కీసర మండలానికి చెందిన రొయ్యపల్లి శ్రీనివాస్ (37)లు. గత వారం రోజుల క్రితం రక్తపోటు అధికం కావడంతో అపస్మారకస్థితిలో పడిపోయారు. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ దవాఖానల్లో చేర్పించగా, చికిత్స అందిస్తున్న వైద్యులు గురువారం బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. వారి శరీరం నుంచి కాలేయం, మూత్రపిండాలను సేకరించారు.

స్వాధీనం చేసుకున్న టిప్పర్‌లారీలు

ప్రభుత్వ భూమి కబ్జాయత్నం.. టిప్పర్లు స్వాధీనం

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 6 : ప్రభుత్వభూమి కబ్జా యత్నాలపై హైడ్రాలో కేసు నమోదైంది. జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, తహసీల్దార్ రెహమాన్ వివరాల మేరకు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్, సర్వేనంబర్ 307లో కొంతకాలంగా కబ్జాయత్నాలు సాగుతున్నాయి. వారంరోజులుగా రాత్రిపూట టిప్పర్లతో మట్టిపోసి చదును చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలపై నిఘాపెట్టిన రెవెన్యూ సిబ్బంది బుధవారం రాత్రి పరిశీలన చేపట్టారు. మట్టిపోసేందుకు టిప్పర్లు రాగా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ ఖలీం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తప్పించుకునే యత్నం..

వాహనాలను ఢీకొని డివైడర్‌పైకి ఎక్కిన కారు

ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు అరెస్ట్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్న విషయాన్ని గమనించిన ఓ మందుబాబు కారును వెనక్కి తిప్పే క్రమంలో రోడ్డు మీద ఆగిన కార్లను ఢీకొట్టడంతో పాటు డివైడర్‌ను ఎక్కించాడు. ఈ ఘటనలో మద్యం తాగిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న పాల్మాకుల మృదుల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇంజినీరింగ్ స్నేహితులు రితుల్‌కుమార్‌రెడ్డి, అజయ్ మంతెన, మెన్నేని అజయ్‌రావ్, జక్కుల విసాస్‌లతో కలిసి బుధవారం రాత్రి మాదాపూర్‌లోని ఓ పబ్‌లో మద్యం సేవించారు. రాత్రి 11.45 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్ నం.10మీదుగా కారులో ఇంటికి బయలుదేరారు. నవయుగ సమీపంలోకి రాగానే రోడ్డుపై జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. గమనించిన మృదుల్ ట్రాఫిక్ పోలీసులను తప్పించుకునే క్రమంలో వేగంగా వెళ్తూ కుడివైపు డివైడర్ మీదుగా యూటర్న్ తీసుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో రోడ్డుమీద ఆగిన కారు(టీఎస్07ఈసీ 1717)ను వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో కారు కుడివైపున నుజ్జునుజ్జయింది. అంతటితో ఆగకుండా కుడివైపు ఉన్న డివైడర్ మీదకు ఎక్కించి పారిపోయేందుకు యత్నించారు. అయితే కుడివైపు రోడ్డు ఎక్కువ ఎత్తులో ఉండడంతో కారు కిందకు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారు నడిపిస్తున్న మృదుల్ చేయి విరగడంతో పాటు ఇతర యువకులకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటనలో అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు కారులో ఉన్న వారిని బయటకు తీసి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. గాయపడిన మృదుల్‌తోపాటు కారులోని నలుగురు వ్యక్తులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా వారంతా మద్యం సేవించినట్లు తేలింది. ఈ మేరకు మృదుల్‌తో పాటు ఇతర యువకులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

ఆధార్ కోసం వాటర్‌ట్యాంక్ ఎక్కిన మహిళ

దూకుతానంటూ బెదిరింపు..

నచ్చజెప్పి కిందకుదించిన పోలీసులు

వేలాడుతున్న మహిళను పైకిలాగుతున్న పోలీసులు

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 6 : తన కొడుకుకు ఆధార్ కార్డు ఇవ్వాలని వాటర్‌టాంకు పైకెక్కిన మహిళ దూకుతానంటూ బెదిరించగా పోలీసులు స్పందించి రక్షించారు. జగద్గిరిగుట్ట పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట, వెంకటేశ్వరనగర్‌లో రాధిక(40).. తన పదేండ్ల కుమారుడితో కలసి నివాసం ఉంటుంది. ఒంటరి మహిళ అయిన ఆమె.. తరచూ తనకు అన్యాయం చేశారంటూ పలుమార్లు పోలీస్‌స్టేషన్ వచ్చి హడావుడి చేసేది. ఈనేపథ్యంలో గురువారం తన కుమారుడికి ఆధార్‌కార్డు ఇవ్వాలంటూ స్థానికంగా ఉన్న ఈ-సేవాకేంద్రానికి వెళ్లగా.. బర్త్‌సర్టిఫికెట్లు, ఇతర పత్రాలతో అప్లై చేయాలని అక్కడివారు సూచించారు. అవేవీ లేకుండా ఆధార్ ఇవ్వాలని వాదనకు దిగింది. ఆపై కుమారుడిని వెంటపెట్టుకుని వేంకటేశ్వర ఆలయం పరిసరాల్లోకి వెళ్లింది. సమీపంలోని వాటర్‌ట్యాంకు పైకెక్కి దూకుతానని బెదిరించింది. అక్కడి వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి రాగా వేలాడుతూ కనిపించింది. దీంతో పోలీసులు ఆమెకు నచ్చజెప్పి రెయిలింగ్‌నుంచి పైకి లాగారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి మరోసారి ఇలాంటి ప్రయత్నాలు చేయవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు.

చేసిన అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచింగ్

హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి అరెస్ట్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6: జల్సాలు, బెట్టింగ్‌లకు బానిసగా మారిన ఓ విద్యార్థి .. చేసిన అప్పులను తీర్చేందుకు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన ఉప్పులేటి శశికుమార్ (21) ప్రస్తుతం ఎల్బీనగర్, మన్సూరాబాద్, సూర్యోదయనగర్ కాలనీలో నివాసముంటూ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. ఖాళీ సమయాల్లో ఫుడ్‌డెలివరీ చేస్తున్నా